క్లుప్తంగా

ప్రతిభా పురస్కారాలకు ఏడుగురి ఎంపిక

తాళ్లపూడి: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచి షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డు - 2025కు తాళ్లపూడి మండలం నుంచి ఏడుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవో సీహెచ్ బాలామణి తెలిపారు. తాళ్లపూడి మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నుంచి శిరిగినీడి సత్యదేవ్ 590 మార్కులు, చెరుకు సుమాంజలి 588 మార్కులు, బండారు మేఘన 585, కూన రేణుక 585, మేకా లక్ష్మి భవ్య 585, మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి జొన్నకూటి అజయ్ కుమార్ 570 మార్కులు, పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఎస్.సాత్విక్ హర్ష 576 మార్కులు సాధించి పురస్కారానికి ఎంపికైనట్టు ఎంఈఓ తెలిపారు. వీరికి రాజమహేంద్రవరం వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో 9వ తేదీ ఉదయం 10 గంటలకు పురస్కారాలు అందజేయనున్నామని, విద్యార్థులు హాజరు కావాలన్నారు.

ఘనంగా విజయ గణపతి వార్షికోత్సవం



తాడిపర్రులో ప్రత్యేక అలంకరణలో విజయ గణపతి

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు గ్రామంలో కొలువైన విజయ గణపతి ఆలయ వార్షికోత్సవాన్ని కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో పాటు స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం సహస్ర నామ పారాయణం, భజనలు నిర్వహించారు.

మొక్కల పంపిణీ

కడియం: మాధవరాయుడుపాలెం సర్పంచ్ అన్నందేవుల చంటి శనివారం గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేసారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం, సంరక్షణపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. టీడీపీ నాయకులు ప్రత్తిపాటి రామారావు చౌదరి, జిల్లా బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పీ. రమేష్, ఎంపీటీసీ గొల్లపల్లి శ్రీను, పడాల బాబీ, రాముడు, వీర్రాజు, ధనుంజయ పాల్గొన్నారు.

ఆంధ్ర కేసరి జూనియర్ కళాశాల కరస్పాండెంట్‌గా కోళ్ల బాబు

సీటీఆర్ఐ: ఆంధ్ర కేసరి సెంటినరీ జూనియర్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్‌గా ది ఇన్నీసుపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (బాబు) ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన కళాశాల పాలకవర్గ సమావేశంలో ఆయన్ను ఎన్నుకున్నట్టు తీర్మానించారు. పాలకవర్గం వైస్ చైర్మన్‌గా దాసరి వెంకటకృష్ణ రమేష్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని కళాశాల చైర్మన్ జెట్టి ప్రసాదరావు, గౌరవ కార్యదర్శి జమ్మి రామారావు, ఆంధ్ర కేసరి యువజన సమితి అధ్యక్ష, కార్యదర్శులు వి.భాస్కరరామ్, ప్రసాద్ రెడ్డి అభినందించారు.

మేలైన యాజమాన్యంతో మెరుగైన ఉత్పత్తులు

కడియం: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా మెరుగైన, నాణ్యమైన ఉత్పత్తులను సాధించవచ్చని వేమగిరి డీఎఫ్ఆర్సీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ డీవీఎస్ రాజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వేమగిరి డీఎఫ్ఆర్సీలో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు మాట్లాడుతూ పూల పంట సాగు యాజమాన్య పద్ధతులను వివరించారు. ఆర్కిడ్స్ ఎక్కువగా ఎగుమతికి అవకాశం ఉందని, వీటి సాగుతో రైతులు మంచి లాభాలు ఆర్జించవచ్చని అన్నారు. కడియం హార్టీ కల్చర్ ఆఫీసర్ డి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ పూలు, కూరగాయల పంట సాగుకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వివరాలను తెలియజేసారు. డ్రిప్, స్ప్రింక్లర్ల ఏర్పాటుకు సబ్సిడీ ఉందన్నారు. కొబ్బరిలో అంతర పంటలుగా కోకో, అరటి తదితర పంటల సాగుతో రైతుకు అదనపు ఆదాయం ఉంటుందన్నారు. కలవచర్ల కేవీకే హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ వికసిత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రతి రోజు రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, నూతన విధానాల రూపకల్పన చేస్తామన్నారు. రాజమహేంద్రవరం ఎస్ఐఆర్సీపీ క్రాప్ ఇంప్రూవ్‌మెంట్ హెడ్ డాక్టర్ సరళ మాట్లాడుతూ పురుగు మందుల వాడకం తగ్గించి, ఆర్గానిక్ ఫార్మింగ్ ద్వారా భూమి ఆరోగ్యాన్ని పెంచవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ ఆఫీసర్ కె.ద్వారకాదేవి, సైంటిస్టులు శిరీష, మాధవన్, లక్ష్మీపతి, అజ్వంత్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని నర్సరీ రైతులు, వ్యవసాయ, ఉద్యాన శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కొల్లగట్టేస్తున్నారు!

- కాలువ గట్ల వద్ద యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
- కూటమి నాయకుల అండదండలతో దందా
- పోలవరం, చింతలపూడి, తాడిపూడి ఎత్తిపోతల పథకాల మట్టి మాయం
- వేల రూపాయలకు కడియం నర్సరీలకూ విక్రయం
- చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



చెరుకుమిల్లి గ్రామం వద్ద పోలవరం కుడి ప్రధాన కాలువ గట్టు మట్టిని తరలిస్తున్న పొక్లెయిన్, లారీలు

గోపాలపురం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి మట్టి అక్రమ తరలింపులో టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. మండలంలోని చెరుకుమిల్లి, చిట్యాల, పెద్దాపురం, వేళ్లచింతలగూడెం, భీమోలు ప్రాంతాల్లో ఉన్న పోలవరం కుడి ప్రధాన కాలువ మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇక్కడున్న ఎర్ర మట్టికి మంచి గిరాకీ ఉండటంతో తూర్పుగోదావరి జిల్లా కడియం చుట్టుపక్కల నర్సరీలకు లారీ రూ.35 వేల నుంచి రూ.40 వేలకు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

పటిష్టతకు తూట్లు

తాడిపూడి, చింతలపూడి కాలువకు అప్పట్లో భూసేకరణ చేసి, మిగిలిన భూమిలో గట్టు పటిష్టతకు కాలువకు ఇరువైపులా మట్టితో నింపారు. ఆ మట్టిపై కన్నేసిన కొందరు అక్రమార్కులు లారీలు, ట్రాక్టర్లపై రేయింబవళ్లు తరలించేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలం గుడ్డిగూడెం, సగ్గొండ, రాజంపాలెం గ్రామాల మీదుగా ఉన్న కాలువ మట్టిని కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయా గ్రామాల టీడీపీ నాయకుల కనుసన్నల్లో తరలిస్తున్నట్టు సమాచారం.

చెరువులలో మట్టిని సైతం

ఇటీవల 20 రోజులుగా గోపాలపురం, భీమోలు, కరిచర్లగూడెం, గంగోలు గ్రామాల్లో ఉన్న పెద్ద చెరువుల్లోని విలువైన మట్టిని రైతుల పేరుతో ఇటుక బట్టీలకు తరలిస్తూ టీడీపీ నాయకులు సొమ్ము చేసుకుంటున్నట్లు ఆ పార్టీలోని కొందరు అసమ్మతి నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. దీనిపై సంబంధిత ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో వివరణ కోరగా, చెరువుల తవ్వకాలకు పెట్టుకున్న కాలపరిమితి పూర్తయిందని, నిలుపుదల చేయాలని సూచించినా పట్టించుకోవడం లేదని, మళ్లీ తవ్వకాలకు అనుమతులు కోరుతున్నారని పేర్కొన్నారు. మట్టి అక్రమ తవ్వకాల్లో నియోజకవర్గ ముఖ్య ప్రతినిధితో పాటు, ఆయన అనుచరులైన కొందరు మట్టి దందాకు తెరలేపారని, కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిన జనసేన, బీజేపీ నాయకులకు ఎటువంటి సమాచారం లేకుండా, కేవలం టీడీపీ నాయకులు మాత్రమే దండుకుంటున్నట్లు ఆయా పార్టీల నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. కాలువ గట్లపై ఉన్న మట్టిని తొలగించడం వల్ల గట్లు బలహీన పడతాయని, రాబోయే రోజుల్లో గట్లు తెగే ప్రమాదం ఉందంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువ మట్టి అక్రమ తవ్వకాలను నిలువరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గోపాలపురంలో రియల్ ఎస్టేట్ భూములను కాలువ మట్టితో పూడ్చిన దృశ్యం

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని దేవరపల్లి సెక్షన్ పరిధిలోని బుచ్చియపాలెం, అచ్చియపాలెం గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీ ఈపీ డీసీఎల్ ఆపరేషన్ నిడదవోలు ఈఈ ఎస్.నారాయణ అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం 33/11 కేవీ రామన్నపాలెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ బుచ్చియపాలెం ఫీడర్ పరిధిలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ముద్రగడపై క్రాంతి వ్యాఖ్యలు సరికాదు

తాళ్లపూడి: తమ నాయకుడు ముద్రగడ గిరిబాబు, ఆయన తండ్రి పద్మనాభంపై నిందలు వేస్తే ఊరుకోబోమని, ఆయన తండ్రి ఆరోగ్యం కోసం గిరిబాబు పడుతున్న కష్టాలు రాష్ట్ర ప్రజలకు తెలుసునని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ మాజీ అధ్యక్షుడు తోట రామకృష్ణ పేర్కొన్నారు. పదవులు కోసం తండ్రి, తమ్ముడిపై ఆరోపణలు సరికాదని క్రాంతి వ్యాఖ్యలను ఆయన ఖండించారు. మా నాయకుడు ముద్రగడ పద్మనాభంపై ఉన్న కక్షతోనే పవన్ కళ్యాణ్ వారి నాయకురాలు క్రాంతితో ఈ వ్యాఖ్యలు చేయిస్తున్నారా అని ప్రజలు అనుమానిస్తున్నారన్నారు.

సహకారానికి పాడె

- హెరిటేజ్ కోసం రైతులను నట్టేట ముంచారు
- రాష్ట్రవ్యాప్తంగా నష్టాల్లో పాల డెయిరీలు
- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



చాగల్లు: హెరిటేజ్ కోసం సహకార డెయిరీ రంగాన్ని చంపేసింది చంద్రబాబేనని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విమర్శించారు. చాగల్లు వచ్చిన ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. దేశంలోనే రెండో అతిపెద్దదైన (2.5 లక్షల లీటర్ల సామర్థ్యం) చిత్తూరు డెయిరీని 1995లో చంద్రబాబు సీఎం అయ్యాక ఆర్థిక నష్టాలకు గురిచేసి, తానే ఒక కమిటీ వేసి దాని సిఫార్సుల మేరకు ఆ డెయిరీని 2002లో మూయించేశారన్నారు. దానినే కాకుండా బాబు హయాంలో 2017 పులివెందుల డెయిరీ, 2018లో రాజమండ్రి డెయిరీ, కృష్ణా జిల్లాలోని మినీ డెయిరీ, 2019లో చిత్తూరులోని మదనపల్లి డెయిరీతో పాటు మరో 8 సహకార డెయిరీలను మూయించి పాడిరైతులను నిలువునా ముంచేశారన్నారు. రాష్ట్ర విభజనకు ముందు లాభాల్లో ఉన్న ప్రభుత్వ డెయిరీలన్నీ బాబు హయాంలో మూతపడ్డాయన్నారు.

పాడి రైతుల మేలుకే అమూల్‌తో ఒప్పందం

జగనన్న పాల వెల్లువ పథకం కింద పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించారన్నారు. లీటరుకు రూ.4 మేర అదనపు ప్రయోజనం కల్పిస్తామంటూ 2019 ఎన్నికల ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీకి మిన్నగా లీటర్‌కు రూ.5 నుంచి రూ.20 వరకు అదనపు లబ్ధి చేకూరింది. జగనన్న ప్రభుత్వంలో ఏడు సార్లు అమూల్ పాల సేకరణ ధర పెంచడంతో ఇతర డెయిరీలు ధరలు పెంచడం వల్ల పాడి రైతులకు రూ.3,395 కోట్ల మేర అదనపు లబ్ధి చేకూరిందన్నారు.

దిక్కుతోచని స్థితిలో 27 లక్షల పాడి రైతు కుటుంబాలు

2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల పాడి రైతు కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడిపోయాయన్నారు. పాల సేకరణ ధరలు దారుణంగా తగ్గించడంతో ప్రైవేటు డెయిరీలు లీటర్‌పై సగటున ఆవుపాలకు రూ.10 నుంచి రూ.20, గేదె పాలపై రూ.15 నుంచి రూ.30 వరకు నష్టం రావడంతో వారు నెలకు రూ.100 కోట్లు నష్టపోతున్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 11 జిల్లాల్లో అమూల్ పాలసేకరణ నిలిపివేసి సొంత డెయిరీ హెరిటేజ్ కోసం ప్రభుత్వ వ్యవస్థలు పని చేస్తున్నాయన్నారు.

డ్రోన్ సాంకేతికతతో నేరాల నియంత్రణ

- ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు



డీఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఏఎస్పీ సుబ్బరాజు

తాళ్లపూడి (కొవ్వూరు): డ్రోన్ టెక్నాలజీతో నేరాలు జరిగిన ప్రదేశాలు సులభంగా గుర్తించవచ్చని, నేర పరిశోధనలోనూ, నిందితుల జాడ తెలుసుకునేందుకు ఆ సంకేతికత ఎంతో ఉపయోగపడుతుందని ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు పేర్కొన్నారు. కొవ్వూరు సర్కిల్ పరిధిలో శనివారం ఆయన పర్యటించారు. డీఎస్పీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో జిల్లాలో కొన్ని నేరాలను గుర్తించడంలో డ్రోన్ సేవలు ఉపయోగపడ్డాయని ఆయన అన్నారు. ఇటీవల మళ్లీ బ్లేడ్ బ్యాచ్ కదలికలు పెరిగాయని, వారిపై డ్రోన్ల ద్వారా నిఘా పెట్టామని వివరించారు. డ్రోన్లతో సుమారు ఐదు నుంచి ఏడు కిలోమీటర్ల పరిధిలో ఫోటోలు, వీడియో సమచారం లభిస్తుందని తెలిపారు. కాగా ముస్లింలు అనుమతి కలిగిన కబేళాల వద్ద బక్రీద్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లాలో పోలీస్ నిఘా పెట్టినట్టు తెలిపారు. గో సంరక్షణ సంఘాలు, ఇతర హిందూ సంఘాల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. గోవులను అనుమతులు లేని కబేళాలకు తరలిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న పెన్షనర్లు



ఆర్టీసీ డిపోలో యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

నిడదవోలు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ల సంఘం నిడదవోలు అధ్యక్షులు బలగం అప్పారావు అన్నారు. పట్టణంలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ కార్యాలయంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం రాజమహేంద్రవరానికి చెందిన అకీరా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో కీర్తి ఆంజనేయులు, పొన్నా సుబ్రహ్మణ్యం శర్మ, కొప్పుల వెంకటేశ్వరరావు, ఎంఎస్ నాగేశ్వరరావు, ఖండవిల్లి రంగాచార్యులు, కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో

యోగాంధ్ర 2025లో భాగంగా నిడదవోలు ఆర్టీసీ డిపోలో శనివారం ఆర్టీసీ ఉద్యోగులు యోగాసనాలు, ప్రాణాయామం చేశారు. కొవ్వూరు డిపో మేనేజర్ వైవీ కుమార్ యోగా గురువుగా వ్యవహరించి పలు యోగాసనాలను వేయించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి, డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



పట్టణంలోని ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



యాదవోలులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

నిడదవోలు: పట్టణంలోని ఆయా మసీదులలో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని ఈద్గా వద్ద ప్రధమ మసీదు కమిటీ ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని ఖురేషియా, బస్టాండ్ సెంటర్, వైఎస్సార్ కాలనీ, చిన్న మసీదులలో ముస్లింలు ఈ బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం గృహాలు బంధుమిత్రులతో కళకళలాడాయి. పేద ముస్లింలకు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో పెద్ద మసీదు ముతవల్లి షేక్ అజీజ్ బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్‌కే వజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

దేవరపల్లి: మండలంలో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఈద్గాకు వెళ్లి అనంతరం నమాజ్ చేశారు. మండలంలోని యాదవోలు, దేవరపల్లి, త్యాజంపూడి, గౌరీపట్నం, దుద్దుకూరు, చిన్నాయగూడెం, లక్ష్మీపురం, బందపురం శివారు రంగరాయకాలనీ గ్రామాల్లో ముస్లింలు ఘనంగ పండగను జరుపుకొన్నారు.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి: త్యాగాలకు గుర్తుగా జరుపుకొనే బక్రీద్‌ను నియోజకవర్గంలోని కొవ్వూరు, తాళ్లపూడి మండలాల్లో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కొవ్వూరు, తాళ్లపూడిలోని మస్జిద్ ఎ అబూబకర్‌లో ప్రత్యేక నమాజులు చేశారు. వేగేశ్వరపురంలోని మస్జిద్ ఏ నూర్, అన్నదేవరపేటలో ఉదయం నుంచి ప్రత్యేక నమాజ్‌లలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి కోసం వెళ్లి చిత్రహింసలు

- ప్రభుత్వం చొరవతో స్వదేశానికి రాక

నల్లజర్ల: ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన ఓ మహిళ ఇబ్బందులు పడిన సంఘటన ఇది. ఆమె కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెం గ్రామానికి చెందిన చిలక నిర్మల తన ఇంటి నిర్మాణానికి అయిన అప్పులను తీర్చేందుకు 16 నెలల క్రితం ఏజెంట్ ద్వారా కువైట్‌కు వెళ్లింది. అక్కడ ఇంటి పనులు చేయడానికి వెళ్లిన నిర్మలకు యజమాని సక్రమంగా భోజనం పెట్టకపోవడం, వెట్టిచాకిరీ చేయించడం నీరసించిపోయింది. తాను చనిపోతున్నానని చెబుతూ ఓ వీడియో తీసి ఆ గ్రామ సర్పంచ్ కొత్తూరి జాన్‌విక్టర్ బాబుకు జరిగిన విషయాన్ని వివరించింది. ఈ విషయాన్ని ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు ద్వారా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మంత్రి లోకేష్ కార్యాలయానికి వెళ్లి విషయాన్ని చెప్పారు. కువైట్ దేశంలోని భారత రాయబారి కార్యాలయ అధికారులతో లోకేష్ సంప్రదింపులు జరిపి తగు ఏర్పాట్లు చేయడంతో గత నెల 21న నిర్మల స్వగ్రామానికి చేరుకుంది. ఆమె ఆరోగ్యం బాగా క్షీణించడంతో ఆసుపత్రిలో ఉండి చికిత్స చేయించుకుంది. బాగా కోలుకున్నాక శనివారం గ్రామసర్పంచ్ విక్టర్ ఆధ్వర్యంలో లోకేష్, వెంకట్రాజు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి తాను కష్టాల్లో ఉంటే స్పందించిన ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపింది.

ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి



విద్యా వనరుల కేంద్రం వద్ద వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

రాజమహేంద్రవరం రూరల్: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు (ఎస్జీటీ) బదిలీల కౌన్సెలింగ్‌ను వెబ్ ద్వారా కాకుండా మాన్యువల్‌గానే నిర్వహించాలని ఉపాధ్యాయుల ఐక్యవేదిక (యూటీఎఫ్)నాయకులు డిమాండ్ చేశారు. శనివారం హుకుంపేట మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఈవీఎస్ఎస్ఆర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో యూనియన్లు జరిపిన చర్చల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు బదిలీలు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించేందుకు అంగీకరించారన్నారు. ఇప్పుడు అధికారులు మాన్యువల్‌గా నిర్వహించడం సాధ్యం కాదని, కేవలం వెబ్ ద్వారా మాత్రమే బదిలీలు జరుపుతామని ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు ఈ నిర్ణయాన్ని వాయిదా వేసుకోకపోతే ఉమ్మడి జిల్లా కేంద్రం కాకినాడలో జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రంలో ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి శ్రీనివాస్, ప్రకాష్, పద్మజ, రాజు, ప్రసాద్, జిలానీ హాజరయ్యారు.

వామ్మో దుమ్ము

- రోడ్డంతా ఇసుకతో కప్పేస్తున్నారు
- ప్రమాదకంగా మల్లయ్యపేట - కాతేరు ప్రధాన రహదారి
- దుమ్ము రేగి వాహన చోదకుల అవస్థ
- ప్రమాదం అంచునే ప్రయాణం



మల్లయ్యపేట వద్ద ఇసుకతో రేగిన దుమ్ము

రాజమహేంద్రవరం రూరల్: మల్లయ్యపేట - కాతేరు ప్రధాన రహదారి మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే కాతేరు, కోటిలింగాల రేవు, సీతానగరంలోని ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక తరలించే వాహనాలు ఈ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళనతో హడలిపోతున్నారు. తారు రోడ్డుపై కొన్ని అంగుళాల ఎత్తు వరకు ఇసుక పేరుకుపోయింది. ద్విచక్ర, త్రిచక్ర వాహనాలే కాకుండా కార్లు కూడా ఈ ఇసుక కారణంగా అదుపు తప్పుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహన చోదకులు అంటున్నారు.

తరచూ ప్రమాదాలు

మల్లయ్యపేట - కాతేరు ప్రధాన రహదారి ముఖ్యంగా రాజమహేంద్రవం సిటీ వైపు నుంచి సీతానగరం వైపు వెళ్లే వారికి, అలాగే సిటీ శివార్లలోని విద్యా సంస్థలకు వెళ్లేందుకు ప్రధాన మార్గంగా ఉంది. ఈ నేపథ్యంలో నిత్యం మహిళలు, విద్యార్థులు, చిరుద్యోగులు ఈరోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. తారు రోడ్డుపై ఇసుక పేరుకుపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు చెబుతున్నారు.

నిబంధనలు బేఖాతర్

ఇసుకను తరలించే వాహనాలపై బరకాలు కప్పి తీసుకువెళ్లాలని నిబంధనలున్నా అక్రమ రవాణాకు తెరతీస్తున్న ఇసుక మాఫియా దీనిని పట్టించుకోవడం లేదు. దీంతో ఇసుక లోడుతో వెళ్లే లారీలు, ట్రాక్టర్లు రోడ్డు మొత్తం ఇసుకను చల్లుకుంటూ పోతున్నాయి. అలా రోడ్డు మీదకు చేరిన ఇసుక ప్రమాదాలకు కారణమవుతోంది. అంతే కాకుండా మల్లయ్యపేట - కాతేరు మధ్య రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులు, దుకాణదారులు, హోటళ్ల నిర్వాహకులు తమ వ్యాపారాలను దుమ్ము కారణంగా మూసేసుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. రోడ్డుపై ఇసుకతో భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో దుమ్ము తమ షాపుల్లోకి చేరుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తినుబండారాల బడ్డీ దుకాణాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు ఈ దుమ్ము కారణంగా గిరాకీ లేకుండా పోతోంది. రోడ్డుకు ఇరు వైపులా ఉన్న ఇతర వ్యాపారులు, నివాసితులు నిత్యం నీటిని చల్లుకుని దుమ్ము, ధూళి రేగకుండా చర్యలు చేపడుతూ నానా పాట్లు పడుతున్నారు.

మండల మానవత అధ్యక్షుడిగా పాకలపాటి



వెంకటేశ్వరావును అభినందిస్తున్న సభ్యులు

నల్లజర్ల: మండల మానవత సంస్థ కార్యవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. సంస్థ అధ్యక్షుడిగా పాకలపాటి వెంకటేశ్వరావు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం కార్యదర్శిగా పత్తిపాటి రాంబాబు, కోశాధికారిగా ఐడీవీ అప్పారావు, సహాయ కార్యదర్శిగా వలిరెడ్డి సతీష్, ఉపాధ్యక్షుడిగా మద్దూరి విష్ణుమూర్తి, ఈసీ ఎడ్యుకేషన్ కేజేడీవీ ప్రసాద్, ఈసీ హెల్త్ బోడిగడ్ల సీతారాముడు, ఈసీ ఎవేర్‌నెస్‌గా ఉన్నమట్ల శ్రీనివాస్, ఈసీ ఎమర్జన్సీగా దొండపాటి దుర్గారావు ప్రమాణ స్వీకారం చేశారు. భోగవల్లి వెంకట సుబ్బారావు, గుళ్లపూడి వెంకటరత్నం, ఎస్.రాజేంద్రప్రసాద్ నూతన కార్యవర్గ సభ్యులను పూలమాలలతో అభినందించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నిడదవోలు డివిజన్

90102 23729 (కొవ్వూరు)

90100 51493 (నిడదవోలు)

90100 68395 (గోపాలపురం)

Office mail : tpgadvt@gmail.com